క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన పటేల్ రమేష్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న రమేష్‌రెడ్డి

సూర్యాపేట : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశా రు. ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విజ్ఞాన కేంద్ర ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

నూతనకల్ : మండల కేంద్రంలో గునగంటి సత్యనారాయణ జ్ఞాపకార్థంగా నిర్మించిన విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవ సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు పెద్దింటి రంగారెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 17న విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. సభకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో న్యూడెమోక్రసీ నాయకులు సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్నా అశోక్, దేసోజు మధు, కూసు లింగయ్య, రమేష్ పాల్గొన్నారు.

చలిగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి



అర్వపల్లిలో చలిమంట కాచుకుంటున్న స్థానికులు

అర్వపల్లి : మిచాంగ్ తుపాను ప్రభావంతో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. దీంతో వాతావరణం చల్లబడింది. దీంతో తెల్లవారుజామున చలి తీవ్రత పెరుగుతుంది. పగటి వేళల్లో కూడా చలిగాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు ఇళ్లు వదిలి బయటికి రావాలంటేనే భయపడుతున్నారు. ఈ చలి నుంచి ఇళ్ల ఆవరణలో, రోడ్లపైన చలి మంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. చలి తీవ్రతతో చిన్నారులు, వృద్ధులు వణికిపోతున్నారు.

నర్సరీల్లో నాణ్యమైన విత్తనాలు నాటాలి

సూర్యాపేట రూరల్ : గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో నాణ్యమైన విత్తనాలు నాటాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బాలెంల, ఎర్కారం, జాటోతుతండా, రామారం గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సంచుల్లో నాటిన విత్తనాలు నుంచి మొక్క ఏపుగా ఎదగడానికి క్రమం తప్పకుండా నీటిని పట్టించాలన్నారు. ఆయన వెంట ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

అర్వపల్లి : అర్వపల్లి శివారులోని హజ్రత్‌ఖాజా నసీరుద్దీన్ బాబా దర్గా వద్ద శుక్రవారం అర్వపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉర్సుకు వచ్చిన భక్తులకు సిబ్బంది వైద్య సేవలందించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది జి.వాణి, వై.దుర్గమ్మ, ఎం.గిరిజ, బి.శ్వేత, ఎ.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయడం హర్షణీయం

హుజూర్‌నగర్ : మలిదశ తెలంగాణ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని పలువురు ఉద్యమకారులు అన్నారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని ఇందిరా సెంటర్‌లో పలువురు ఉద్యమకారులు సంబరాలు జరుపుకుని మిఠాయిలు పంచారు. కేసులు ఎత్తివేయడం సీఎం ఉద్యమకారుల పట్ల చూపిస్తున్న ప్రేమాభిమానలకు తార్కాణమని అది సువర్ణ అక్షరాలతో లిఖించే విషయమన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- అర్ధరాత్రి ట్రాక్టర్ల ద్వారా పక్క జిల్లాలకు తరలింపు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు



అనంతారం బిక్కేరువాగు నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంతగా మారింది తిరుమలగిరి మండలంలోని ఇసుక అక్రమార్కుల భాగోతం. నూతన రోడ్లకు, ప్రభుత్వ భవన నిర్మాణాల కోసం, ఇతర అవసరాలకు పర్మిషన్లతో వెళ్లాల్సిన ఇసుక యథేచ్ఛగా అక్రమంగా పగలు, రాత్రి అనక రవాణా జరుగుతుంది. మండలంలోని అనంతారం, తాటిపాముల గ్రామాల నుంచి బిక్కేరు వాగు ప్రవహిస్తుంది. ఈ బిక్కేరు వాగులోని ఇసుకను అక్రమణదారులు ట్రాక్టర్ల ద్వారా రాత్రి పూట ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు అక్రమార్కులు. ఈ దందా మండలంలో మూడు పువ్వులు ఆరుకాయలు అన్నట్లుగా సాగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అర్ధరాత్రి పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తవ్వి మండల కేంద్రంతో పాటు జనగామ జిల్లా పాలకుర్తి, కొడకండ్ల, పెద్దవంగర మండలాలకు సైతం ఇసుక తీసుకెళ్తున్నారు. రాత్రి సమయంలో ఇసుక ట్రాక్టర్లు ఇళ్ల ముందు నుంచి వేగంగా వెళ్తుండటంతో అనంతారం గ్రామస్తులు రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నిద్రకు భంగం కలుగుతుందని వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఎలాంటి అనుమతులు లేకుండా, పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగుతుందని గ్రామస్తులు జిల్లా అధికారులకు సైతం గతంలో ఫిర్యాదు చేశారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, నామ మాత్రంగా 1, 2 ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి సమయాల్లో దూర ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్న యజమానుల నుంచి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.500 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై గ్రామంలో 100 నంబర్‌కు ఫోన్ చేస్తే వారే ఇసుక అక్రమ రవాణాదారులకు సమాచారం అందజేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక ట్రాక్టర్ల యజమానుల నుంచి కొంత మంది ఫోన్‌పేలు, గూగుల్ పేలు చేయించుకుంటున్నారని, దీంతో వారి కనుసన్నల్లోనే ఇసుక అక్రమ రవాణా సాగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ బిక్కేరు వాగులో ఇసుక అక్రమంగా తవ్వడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, బోర్లలో నీరులేక ఎండి పోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి ఈ ఇసుక అక్రమ రవాణాను ఆపాలని, భూగర్భజలాలు అడుగంటకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

> **ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు**
>
> 
>
> అనంతారం గ్రామ సమీపంలోని బిక్కేరు వాగు నుంచి ప్రతిరోజు రాత్రి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా సాగుతుంది. ట్రాక్టర్లు వేగంగా వెళ్తుండటంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. అలాగే గ్రామంలోని బోర్లలో నీరులేక అడుగంటుతున్నాయి. ఇసుక అక్రమ రవాణా ఆపాలని అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికై నా ఇసుక అక్రమ రవాణా అరికట్టే చర్యలు తీసుకోవాలి.
>
> – చిలుక అశోక్, అనంతారం

ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నేటి ఓటమే రేపటి గెలుపుకు నాంది అని, నియోజకవర్గ ప్రజలకు సేవా కార్యక్రమాలు అందిస్తానన్నారు. పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పాల్పడిన వారిని అదిష్టానం దృష్టికి తీసుకెళ్లామని, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని తెలిపారు. నియోజకవర్గంలో అహంకారంతో ఉన్న వారికి సరైన బుద్ధిచెప్పారని అన్నారు. తుంగతుర్తి అభ్యర్థిగా గెలిచిన మందుల సామేల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు వై.ధీన్‌దయాళ్, ఎం.యాదగిరి, కడియం కళ్యాణ్, హన్మంతుయాదవ్, దుశ్వంత్‌రెడ్డి, బంగార్రాజు తదితరులు ఉన్నారు.

వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



విద్యార్థుల వివరాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రాములునాయక్

నూతనకల్ : పాఠశాలల్లో అడ్మిషన్ రిజిస్టర్‌లో ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల విద్యాధికారి రాములు నాయక్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల రిసోర్స్ కార్యాలయంలో నూతనకల్, మద్దిరాల మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, కస్తూరిబా గాంధీ పాఠశాలల్లోని 2023–24 విద్యా సంవత్సరంలో వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు అడ్మిషన్ పుస్తకంలోని వివరాలను అధికారులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆయన వెంట పరిశీలన అధికారి శివయ్య, బాషిత్, భిక్షం, హరికృష్ణ, సీఆర్పీలు జానకిరాములు, వీరస్వామి, రమాకాంత్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి జెడ్పీ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



పాఠశాలలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా కోర్సు టూరిజం అండ్ హాస్పిటాల్టీ అభ్యసిస్తున్న విద్యార్థులు శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కూరగాయలు, పండ్లు ఉపయోగించి వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దామెర శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకన్న, ఉపేంద్ర, రాజు, రవీందర్, లక్ష్మీనర్సయ్య, గోపి, శాంతిప్రియ పాల్గొన్నారు.

బీటీ రోడ్లకు మోక్షమెప్పుడో..!

- పలు గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయం
- గత ప్రభుత్వ హయాంలో మంజూరుకాని నిధులు
- ఇప్పుడైనా నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజల వేడుకోలు



గుంతలమయమై వర్షపు నీటితో నిండిన బొల్లంపల్లి వెళ్లే రోడ్డు



అర్వపల్లి నుంచి కొత్తగూడెం వెళ్లే రోడ్డు దుస్థితి



బీటీ ఆనవాళ్లు కోల్పోయిన కొత్తగూడెం వెళ్లే రోడ్డు

అర్వపల్లి : గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారి రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్లుగా రోడ్ల మరమ్మతులు జరగక గతంలో నిర్మించిన రోడ్లు గతుకులమయంగా మారి ప్రయాణించాలంటే ప్రాణసంకటంగా మారాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరైనా టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు మొదలుకాని పరిస్థితి నెలకొంది. మరికొన్ని రహదారుల మరమ్మతులకు నిధులు సకాలంలో మంజూరు కాని పరిస్థితి. జాజిరెడ్డిగూడెం మండలంలోని పలురోడ్ల పరిస్థితి ఇలాగే ఉంది.

నిధులు మంజూరైనా నిరుపయోగం..

జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి నుంచి కొత్తగూడెం వెళ్లే రోడ్డు బీటీ రెన్యూవల్‌కు రూ.71లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి ఇప్పటికే 7సార్లు పంచాయతీరాజ్ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. కాగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు సూర్యాపేటకు చెందిన ఓ కాంట్రాక్టర్ టెండర్ వేసి కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. అయితే పనులు మాత్రం ప్రారంభించలేదు. ఇప్పటికైనా పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే 365 హైవే వెంట ఉన్న బొల్లంపల్లి స్టేజీ నుంచి పర్సాయపల్లి గ్రామం వరకు బీటీకి ఆర్‌అండ్‌బీ నుంచి రూ.8.30కోట్లు మంజూరయ్యాయి. కానీ ఈ రోడ్డు పనులు కూడా మొదలు కావడం లేదు. తిమ్మాపురం నుంచి సంగెం వరకు రోడ్డు విస్తరణకు గతంలో రూ.30కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ జరగాల్సి ఉంది. అర్వపల్లి నుంచి కాసర్లపహాడ్ మీదుగా కొమ్మాల వరకు 9కి.మీ రోడ్డు బీటీ రెన్యూవల్‌కు రూ.3కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. అలాగే తూర్పుతండా, గన్నెనాయక్‌తండా రోడ్ల బీటీకి కూడా ప్రతిపాదనలు పంపారు. వాటికి కూడా నిధులు మంజూరు కావాల్సి ఉంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి నిధులు మంజూరైన రోడ్ల పనులను వెంటనే ప్రారంభించి, ప్రతిపాదనలు వెళ్లిన రోడ్లకు నిధులు మంజూరు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

> **ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం**
>
> 
>
> కొత్తగూడెం గ్రామానికి బీటీ రెన్యూవల్‌కు నిధులు మంజూరై ఏళ్లు కావొ స్తున్నా పనులు జరగడం లేదు. ప్రస్తుతం ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతిని నడిచి వెళ్లలేని విధంగా మారింది. రాత్రయితే ఈ రోడ్డుపై ప్రయాణం సాగించాలంటే నరకం చూడాల్సివస్తుంది. అధికారులు స్పందించాలి.
>
> – శీలం రాము, కొత్తగూడెం

> **నిధులు మంజూరైనా పనులు జరగడం లేదు**
>
> 
>
> బొల్లంపల్లి నుంచి పర్సాయపల్లి వరకు బీటీరోడ్డుకు రూ.8.30కోట్లు ఏడాది కిందట నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదు. రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే సామేలు బీటీ రోడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. త్వరలో హామీని నెరవేర్చాలి.
>
> – కేసాని రాహుల్, బొల్లంపల్లి

> **కొత్తగూడెం రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తాం**
>
> 
>
> కొత్తగూడెం రోడ్డు బీటీ రెన్యూవల్‌కి రూ.71లక్షలు మంజూరు కాగా టెండర్ ప్రక్రియ పూర్తి చేశాం. కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ కాగానే బీటీ రెన్యూవల్ పనులు ప్రారంభిస్తాం. 365 హైవే రోడ్డు నుంచి బొల్లంపల్లి రోడ్డు బీటీకి నిధులు మంజూరయ్యాయి. తిమ్మాపురం–సంగెం రోడ్డు విస్తరణకు రూ.30కోట్లు నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం. మిగిలిన తండాలకు బీటీరోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం.
>
> – గుర్రం కొండయ్య, పీఆర్ డీఈఈ

అలంకారప్రాయంగా విద్యుత్ దీపాలు

- 365 జాతీయ రహదారి వెంట వెలగని హైమాస్ట్ లైట్లు
- పలు కూడళ్ల వద్ద రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



మద్దిరాల 365 జాతీయ రహదారి వెంట అలంకారప్రాయంగా ఉన్న హైమాస్ట్ లైట్

మద్దిరాల : మండలంలోని 365 జాతీయ రహదారి వెంట పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలుగకుండా అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలం నుంచి నాలుగు జిల్లాలను కలుపుకొని 365 జాతీయ రహదారి వెళ్లింది. దీంతో ఈ రహదారిపై వాహనాల రద్దీ అధికంగానే ఉంటుంది. మండలంలోని రహదారి నుంచి సూర్యాపేట–వరంగల్, సూర్యాపేట–మహబూబాబాద్, సూర్యాపేట–నల్లగొండ ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఈ జాతీయ రహదారి వెంట ఉన్న కూడళ్లలో ఎర్రపహాడ్ ఎక్స్‌రోడ్డు, మద్దిరాల మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల్లో అధికారులు హైమాస్ట్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. కాని వాటి నిర్వహణ బాధ్యతలను మరిచారు. వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో రాత్రి సమయంలో వాహనదారులు, ప్రయాణికులు భయంభయంగా వెళ్లాల్సివస్తుంది. ముఖ్యంగా పలు చోట్ల సూచిక బోర్డులు హైమాస్ట్ లైట్స్ లేకపోవడంతో దారి తెలియక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పలు కూడళ్లలో లైట్లు వెలకగపోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా ఉన్నట్లు వాపోతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి వెంటనే రహదారి వెంట ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వాటిని అందుబాటులోకి తీసుకొచ్చి ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

> **రెండేళ్లుగా లైట్లు వెలగడం లేదు**
>
> 
>
> జాతీయ రహదారి వెంట హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు వాటికి విద్యుత్ కనెక్షన్లను ఇవ్వకపోవడంతో అవి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే వాటికి కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తీసుకురావాలి.
>
> – మద్దెల భిక్షపతి, కుక్కడం

> **దూర ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్నారు**
>
> 
>
> మద్దిరాల, ఎర్రపహాడ్ ఎక్స్ రోడ్డుల్లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్స్‌కు నేటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడం అదే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో దూర ప్రాంత వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సూచిక బోర్డులను ఏర్పాటు చేసి హైమాస్ట్ లైట్లకు విద్యుత్ కనెక్షన్‌ను ఇచ్చి అందుబాటులోకి తేవాలి.
>
> – వంగూరి రమేష్, బీజేపీ నాయకుడు, మద్దిరాల

ఉచిత బస్సు సౌకర్యం.. హర్షణీయం

నూతనకల్ : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ వైద్య సాయం పెంపుదల పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేయడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని నేటి నుంచి అమలు చేయడంతో పాటు ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.10లక్షలకు పెంచడంతో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. సోనియగాంధీ జన్మదిన వేడుకలకు శనివారం విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట పార్టీ జిల్లా నాయకులు క్లెం కృష్ణారెడ్డి, తీగల గిరిధర్‌రెడ్డి, రాచకొండ అయోధ్య, ధరిపెల్లి వీరన్న, బాణాల సుదర్శన్‌రెడ్డి, మెంచు చక్రయ్య, బంటు బద్రి తదితరులు ఉన్నారు.

మద్దిరాల : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు నేటి నుంచి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం హర్షణీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు ఏఐసీసీ అధినేత సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అసెంబ్లీ ఎదుట నేడు మధ్యాహ్నం 1.30నిమిషాలకు మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం పథకాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. అదే విధంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించే సోనియగాంధీ జన్మదిన వేడుకలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు జగన్‌రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణమూర్తి, సురేష్‌గౌడ్, పాక అమృతమల్లు, కుతిబుద్దీన్, ఉపేందర్, భిక్షపతి, లింగయ్య, ఏల్లేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతాలు



హుజూర్‌నగర్ : శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయంలో వ్రతంలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ : కార్తీకమాసాన్ని పురస్కరించుకొని హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీభీమలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పూలదండలతో అలంకరించారు. సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం తదుపరి రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని పూజారులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కోటి ఒత్తులతో దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి, పూజారి, పాలక మండలి చైర్మన్, ధర్మకర్తలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

రామాలయంలో సామూహిక వ్రతాలు

నడిగూడెం : కార్తీక మాసం సందర్భంగా మండల కేంద్రంలోని రామాలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారి వరదాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అవస్థలు

- అరకొర వసతులు.. శిథిల భవనాల్లోనే గ్రామపాలన
- పలు పంచాయతీలకు నిధులు మంజూరైనా చేపట్టని పనులు
- ఇబ్బందులు పడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



గట్టికల్లులో శిథిలావస్థకు చేరిన గ్రామపంచాయతీ భవనం

ఆత్మకూర్ (ఎస్) : గ్రామ స్వరాజ్యంలోనే దేశ స్వరాజ్యం జరుగుతుందని ఉపన్యాసాలు ఇచ్చే అధినాయకులు గ్రామపంచాయతీల్లో వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారు. అరకొర వసతులు, శిథిల భవనాలతో గ్రామసచివాలయాలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల ఏర్పడిన నూతన గ్రామపంచాయతీలు మాత్రం నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. నూతన ప్రభుత్వంలోనైనా గ్రామపంచాయతీలకు భవనాలు చేకూరాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరడంతో..

మండల వ్యాప్తంగా గతంలో 19గ్రామపంచాయతీలు ఉండగా.. నూతనంగా తండాలను పంచాయతీలుగా మార్చడంతో వాటి సంఖ్య 30కి చేరింది. అయితే గతంలో ఉన్న పంచాయతీలకు దశాబ్దాల క్రితం భవనాలు నిర్మించడంతో చాలా వరకు శిథిలావస్థకు చేరాయి. మండలంలోని గట్టికల్, కోటపహాడ్, ఏనుబాముల, కందగట్ల, ఏపూరు, మక్తాకొత్తగూడెం, దాచారం గ్రామపంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరడంతో పాటు ప్రస్తుత అవసరాలకు ఏ మాత్రం సరిపోవడం లేదు. దీంతో ఆయా పంచాయతీలకు నూతన భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అలాగే నూతనంగా ఏర్పడిన పీపానాయక్‌తండా, కొత్తతండా, బోరింగ్ తండా, బోట్యాతండాలకు భవనాలు మంజూరయ్యాయి. కాగా కోటపహాడ్‌లో మాత్రమే భవన నిర్మాణం పూర్తి కాగా ఇప్పటివరకూ ఏ గ్రామ పంచాయతీలోనే నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన పంచాయతీల్లో అద్దె ప్రతిపాదికన, అరకొర వసతుల మధ్య పంచాయతీ భవనాల్లో పాలన సాగిస్తున్నారు.

> **నూతన భవనాలు నిర్మించాలి**
>
> 
>
> గ్రామ పంచాయతీలకు ఎప్పుడో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. పెచ్చులు ఊడి పడడంతో పాటు కురుస్తుండడం, ఇప్పటి అవసరాలకు ఏవిధంగానూ సరిపోవడంలేదు. అదే విధంగా నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పడిన తండాల్లో మాత్రం అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. వెంటనే గ్రామపంచాయతీలకు నూతన భవనాలను నిర్మించాలి.
>
> – దంతూరి సోమన్న